క్లుప్తంగా

తిరుపతిలో సృజనాత్మక పరిశ్రమల ఏర్పాటు

తిరుపతి మంగళం: సృజనాత్మక పరిశ్రమలు ఏ ప్రాంతానికైనా, దేశానికైనా జాతీయ సంపద సృష్టిస్తాయని బ్రిటిష్ కౌన్సిల్ ఆర్ట్ డైరెక్టర్ జోనాథన్ కెన్నెడీ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో బ్రిటిష్ కౌన్సిల్ ఆర్ట్ డైరెక్టర్, సౌత్ ఇండియా డైరెక్టర్ జనక పుష్పనాథన్‌ను ఎంపీ గురుమూర్తి కలిశారు. తిరుపతిలో సృజనాత్మక పరిశ్రమలు, సృజనాత్మక ఆర్థిక పరిజ్ఞానం, వాటి ఆధారిత ఆర్థిక కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించారు.

30న జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో 30న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ బ్యూరో డిప్యూటీ చీఫ్ శ్రీనివాసులు శుక్రవారం పేర్కొన్నారు. టాటా క్యాపిటల్ కంపెనీలో 500 లోన్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం జాబ్ మేళా చేపట్టనున్నట్లు తెలిపారు. డిగ్రీ, ఇంటర్మీడియెట్ పూర్తిచేసి 31 ఏళ్ల లోపు వారు అర్హులని, నాలుగేళ్ల అనుభవం ఉండాలని చెప్పారు. ఎంపికైన వారు తిరుపతి, శ్రీకాళహస్తి, పలమనేరు, చిత్తూరు, పులిచెర్ల ప్రాంతాల్లో పనిచేయాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 10గంటలకు తిరుపతి, తిలక్ రోడ్డులోని కృష్ణ తులసి ప్యారడైజ్, ఫస్ట్‌ఫ్లోర్‌లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8886459910, 8197100215 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రామచంద్ర యాదవ్ పబ్లిసిటీ స్టంట్

రేణిగుంట: భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకులు బోడె రామచంద్రయాదవ్ రేణిగుంట విమానాశ్రయంలో పబ్లిసిటీ స్టంట్లు ప్రదర్శించారు. పార్టీ స్థాపన అనంతరం ఆయన పుంగనూరు వెళ్లేందుకు శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం వాహనాలు ర్యాలీగా రేణిగుంట మీదుగా తిరుపతికి వెళ్లాయి. ఆయన వాహన శ్రేణి ముందు సోషల్ మీడియా ప్రతినిధులతో హంగామా చేశారు. బోడె రామచంద్రయాదవ్, అనుచరులపై గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు.

రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు తీసుకోండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): టీడీపీ నేతలతో కలిసి రికార్డులను తారుమారు చేసిన చంద్రగిరి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని పనపాకంకు చెందిన గురుమూర్తి కోరారు. ఆయన శుక్రవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డికి ఫిర్యాదు చేశారు. తన తండ్రి గురవయ్య పేరుతో ఉన్న రూ.5 కోట్ల విలువైన ఆస్తులను పనపాకం వీఆర్వో శ్రీనివాస్, చంద్రగిరి ఆర్‌ఐ సులోచన, తహసీల్దార్ శిరీష అక్రమ మార్గాల్లో చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యంనాయుడు, బత్తినవారిపల్లికి చెందిన తారపతిరెడ్డి, చెర్లోపల్లికి చెందిన సుభాషిణి పేరుతో మార్చారని ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేసి నివేదిక ఇవ్వాలని తిరుపతి ఆర్డీవో కనకనరసారెడ్డిని ఆదేశించారు.

బ్యాడ్మింటన్‌కు మహర్దశ

- తిరుపతిలో రాష్ట్ర స్థాయి అండర్-19 పోటీలు
- పాల్గొంటున్న జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు
- నేడు మెయిన్ డ్రా పోటీలు
- హాజరుకానున్న క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా



క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించి క్రీడారంగానికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా 'ఆడుదాం ఆంధ్ర' వంటి బృహత్తర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని పిలుపునిచ్చింది. క్రీడాశాఖా మంత్రి ఆర్కే.రోజా చొరవతో తిరుపతి వేదికగా రాష్ట్ర స్థాయి అండర్-19 బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు తిరుపతిలో జరగడం ఇదే ప్రథమం.

క్వాలిఫైయింగ్ లీగ్ పోటీలు ప్రారంభం

తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ బ్యాడ్మింటన్ అండర్-19 పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 256 మంది పురుషులు, మహిళలు ఈ పోటీలలో పాల్గొంటున్నారు. మెయిన్ డ్రా కోసం అర్హత సాధించేందుకు పలు జిల్లాల క్రీడాకారులు ఇండోర్ స్టేడియానికి చేరుకున్నారు. క్వాలిఫైయింగ్ లీగ్ పోటీలు ముగిసిన వెంటనే మెయిన్ డ్రాకు అర్హత పొందిన క్రీడాకారులు శనివారం ప్రారంభమయ్యే పోటీలలో తలపడుతారు. వీరితో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు సైతం ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం విశేషం.

వసతి సదుపాయాలు భేష్

చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తుండగా.. సుమారు రూ.10లక్షల వ్యయంతో క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు తిరుపతికి చేరుకున్నారు. టోర్నమెంట్ జరుగుతున్న ప్రాంతం వద్ద మంచి నీటి సదుపాయాలతో పాటు, మెడికల్ సిబ్బందిని నియమించారు.

హాజరుకానున్న క్రీడాశాఖ మంత్రి

శనివారం ప్రారంభం కానున్న బ్యాడ్మింటన్ అండర్-19 మెయిన్ డ్రా మ్యాచ్‌లను రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖా మంత్రి ఆర్కే.రోజా హాజరై లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆమెతో పాటు స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, నగర మేయర్, కమిషనర్ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం

జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ఏర్పాట్లలో రాజీ పడకుండా, ఖర్చుకు వెనుకాడకుండా క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించాం. ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాం.

రామకృష్ణయ్య,
టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ

శుభపరిణామం



ప్రభుత్వం క్రీడలకు ఏ రాష్ట్రం ఇవ్వని ప్రాధాన్యతను ఇస్తోంది. మండల స్థాయి టోర్నమెంట్లు నిర్వహించడం గర్వించదగ్గ విషయం. బ్యాడ్మింటన్ టోర్నమెంటును తిరుపతిలో నిర్వహించడంతో వైజాగ్ నుంచి ఇక్కడకు వచ్చాం. వసతులు చాలా బాగున్నాయి. అండర్ -19లోనూ విజయం సాధించాలనే పట్టుదలతో సాధన చేస్తున్నాం.

-కోచ్ చంద్రశేఖర్‌తో క్రీడాకారులు ధరణి, హర్షిత, విశాఖపట్నం

బ్యాడ్మింటన్‌కు పూర్వవైభవం



చాలా కాలం తర్వాత స్టేట్ లెవల్ టోర్నమెంట్లు తిరుపతిలో నిర్వహించడం సంతోషకరం. బ్యాడ్మింటన్‌కు పూర్వ వైభం వచ్చినట్లు అనిపిస్తోంది. ఇదివరకు రాష్ట్ర స్థాయి పోటీలు పెద్ద పెద్ద నగరాలకే పరిమితమయ్యేవి. అండర్-19 పోటీలకు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరవుతున్నారు. వసతి సదుపాయాలు బాగున్నాయి.

-జిలానీ బాషా, సూరిబాబు, మ్యాచ్‌రెఫరీలు, అంతర్జాతీయ అంపైర్లు

వసతులు బాగున్నాయి



చాలా ఏళ్ల తర్వాత బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఇక్కడ జరుగుతోంది. మేము విజయనగరం నుంచి వచ్చాం. వసతి సదుపాయాలు, భోజనం అద్భుతంగా ఉంది. నేను గతంలో జాతీయ స్థాయి అండర్ -13 పోటీలలో పాల్గొని నేషనల్ లెవల్‌లో 12 స్థానం సాధించాను. నేడు జరగనున్న మెయిన్ డ్రాలో తలపడనున్నాను.

-కోచ్ శ్రీనివాసరావుతో క్రీడాకారిణి రేణుశ్రీ



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,220
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,498
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,500
రిటైల్ వెండి గ్రాము	రూ.77.50

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

తిరుపతి తుడా: తిరుపతి శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో పారా మెడికల్ డిప్లొమా కోర్సుల దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరా దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 19వ తేదీ లోపు ఆసక్తి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు డిప్లొమా కోర్సులకు అర్హులన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో మొత్తం 76 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీ - 30, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ -30, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ -10, డిప్లొమా ఇన్ డార్క్ రూమ్ అసిస్టెంట్ - 6 సీట్లు అందుబాటులో ఉంటాయని, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. http://www. appmb.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకుని పూరించిన ఆ దరఖాస్తును ఆగస్టు 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు 100 రూపాయలు చెల్లించి పారా మెడికల్ విభాగంలో నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు మొబైల్ నంబర్ 9440879943 ను సంప్రదించాలని ఆమె కోరారు.

రామరాజ్యం జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి

పాకాల: రాష్ట్రంలో రామరాజ్యం జగనన్నతోనే సాధ్యమని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని లింగనపల్లి, దామలచెరువు పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ లింగనపల్లి పంచాయతీలో 678 మంది వివిధ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోగా.. 567 మందికి అందించినట్టు తెలిపారు. అలాగే దామలచెరువు పంచాయతీలో 1,600 మందికిగాను 1,452 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. లింగనపల్లి పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలకు మొత్తం రూ.3.29 కోట్లు, దామలచెరువు పంచాయతీలో రూ.5.93 కోట్లతో డ్రైనేజీలు, రచ్చబండలు, ఆర్బీకే, సచివాలయం, గ్రంథాలయం, జగనన్న సమావేశ మందిరం వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అంతకుముందు చంద్రగిరి మండలం గంగులపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, వైస్ ఎంపీపీ నాగూర్‌బీ, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీటీసీ గౌతమి, సర్పంచ్ సునిత, వైస్ సర్పంచ్ ఇమ్రాన్, రఘుపతి, రహీం, ఖాజామస్తాన్, గణేష్, గణపతి రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ మాలతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుల నియామకం



ధరణీకుమార్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, రజాక్, తిమ్మారెడ్డి, శివప్రసాద్, మోహన ఆచారి, శ్రీనివాసులు, మహమ్మద్‌ఖాసీం, గోవిందరెడ్డి



చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి, వెంకటేష్, మునేంద్రబాబు, శంకర్‌రాయల్, వాసుయాదవ్, భాస్కర్‌రెడ్డి, శివకుమార్, మునికృష్ణారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి



వెంకటరెడ్డి, చంద్రనాయక్, కేశవులు, ఎస్.బాలకృష్ణ, మునిరాజరెడ్డి



భాస్కర్‌రెడ్డి, సత్రవాడ రోజా, మునస్వామిరెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని పలు పంచాయతీలకు వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షులను నియమిస్తూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిగురువాడకు ముచ్చెలి ధరణీకుమార్‌రెడ్డి, తిరుచానూరుకు బుజ్జిరెడ్డి, ముండ్లపూడికు తిరుమల్‌రెడ్డి, రణధీర్‌పురానికి షేక్ రజాక్, పానకంకు తిమ్మారెడ్డి, పేరూరు-1కు మేర్లపాకు శివప్రసాద్, పేరూరు-2కు మోహన ఆచారి, వెంకటపతినగర్‌కు శ్రీనివాసులు, సప్తగిరికాలనీకి మహమ్మద్‌ఖాసీం, తుమ్మలగుంటకు సింగం.గోవిందరెడ్డి, తిరుచానూరు-2కు చంద్రశేఖర్, పెరుమాళ్లపల్లి-1కు దామోదరరెడ్డి, తిరుచానూరు-3కు వెంకటేష్, పెరుమాళ్లపల్లి-2కు మునేంద్రబాబు, చెర్లోపల్లికు శంకర్‌రాయల్, తిరుచానూరు-1కు వాసుయాదవ్, శెట్టిపల్లికు భాస్కర్ రెడ్డి, తిరుచానూరు-4కు శివకుమార్, పద్మావతి పురానికి బిరుదాల మునికృష్ణారెడ్డి, శ్రీనివాసపురానికి వెంకటకృష్ణారెడ్డి, సీమల్లవరానికి వెంకటరెడ్డి, దామినేడుకు చంద్రనాయక్, అవిలాల-1కు కేశవులు, అవిలాలకు ఎస్.బాలకృష్ణ, వేమూరుకు మునిరాజరెడ్డి, విద్యానగర్‌కు భాస్కర్‌రెడ్డి, అవిలాల-2కు సత్రవాడ రోజా, బ్రాహ్మణపట్టుకు మునస్వామిరెడ్డి నియమితులయ్యారు.

టీటీడీ ట్రస్టులకు రూ.30 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కు అందిస్తున్న దాతలు

తిరుమల: టీటీడీలోని పలు ట్రస్టులకు శుక్రవారం రూ.30 లక్షలు విరాళంగా అందింది. విరాళం చెక్కులను దాతలు తిరుమలలోని కార్యాలయంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అందజేశారు. బెంగళూరుకు చెందిన మంజునాథ రెడ్డి, కృష్ణారెడ్డి కలిసి ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షలు అందజేశారు. బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు ఆనందకుమార్ అనే భక్తుడు రూ.10 లక్షలు అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం: మండలంలోని శాఖమూరికండ్రిగ వద్ద గల గ్రానైట్ ఫ్యాక్టరీలో ఓ వ్యక్తి ఉరివేసుకుని తనువు చాలించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. రాజస్థాన్‌కు చెందిన మహేంద్ర (35) శాఖమూరికండ్రిగలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఎంతకీ తలుపు తీయకపోవడంతో తోటికూలీలు యజమాని వసంత నాయుడుకు సమాచారం అందించారు. ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందజేయగా.. వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఉరికి వేలాడుతున్న మహేంద్రను కిందకు దించారు. పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐదు ఐచ్ఛిక సెలవులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోని అన్ని పాఠశాలలు ఐదు రోజులు ఆప్షనల్ హాలిడేస్ (ఐచ్ఛిక సెలవులు) ఉపయోగించుకోవచ్చని తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ వి.శేఖర్, డీసీఈబీ కార్యదర్శి ఆర్.వంశీరాజ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న మొహర్రం, ఆగస్టు 25న వరలక్ష్మీ వ్రతం, నవంబరు 27న కార్తీక పౌర్ణమి, డిసెంబరు 26న బాక్సింగ్ డే, 2024 జనవరి 1న వీటిని వినియోగించుకోవచ్చన్నారు. అలాగే లోకల్ హాలిడేస్ కింద మూడు రోజులు ఆయా ప్రాంతాల్లో స్థానికంగా నిర్వహించే ముఖ్య పండుగలకు సంబంధిత ఉన్నతాధికారులు అనుమతి తీసుకుని సెలవులు తీసుకోవచ్చని వారు పేర్కొన్నారు.

అప్పీలు కేసులో నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: చోరీ అప్పీలు కేసులో తమిళనాడు వేలూరు జిల్లా గుడియాత్తం తాలూకా ఉప్పరపల్లికి చెందిన టి.ఆనందరాజ్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ శుక్రవారం తీర్పు చెప్పారు. 2021 జూన్‌లో పుత్తూరు, మూలకోన శివాలయం వద్ద, పుత్తూరు కాపువీధిలో రెండు బైక్‌లను ముగ్గురు దుండగులు చోరీ చేసి ఆనందరాజ్‌కు విక్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పుత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేసి దుండగులను అరెస్టు చేసి వాహనాలను కొనుగోలు చేసిన ఆనందరాజ్‌పై కేసు నమోదు చేసి పుత్తూరు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలు పరిశీలించి నలుగురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ 2021లో తీర్పు చెప్పారు. ముగ్గురు నిందితులు ఇదివరలో శిక్షను అనుభవించారు. ఆనందరాజ్ తిరుపతి కోర్టులో అప్పీలు దాఖలు చేశాడు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు తీర్పును ఖరారు చేస్తూ ఆనందరాజ్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వెంకటనారాయణ వాదించారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- అంతరాయాల పర్యవేక్షణకు కాల్ సెంటర్ల ఏర్పాటు
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) సీఎండీ సంతోష రావు సూచించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే అంతరాయాలను పర్యవేక్షించడానికి సర్కిల్ కేంద్రాల్లోని సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్ నియంత్రణలో ఈ పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నంబరు 1912 కు అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యే వరకు 24 గంటలు పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు, నియంత్రికలు దెబ్బతినడంతో పాటు ఇతర విద్యుత్ సరఫరా సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆయా సర్కిల్ పరిధిలో ఈ కింది నంబర్లను సంప్రదించవలసిందిగా వినియోగదారులకు సూచించారు.

నెల్లూరు: 94408 17468
తిరుపతి: 94408 17412
కడప: 94408 17440
అనంతపూర్: 94910 67446
కర్నూలు: 73826 14308

మహిళలపై దాడులను అరికట్టాలి

తిరుపతి కల్చరల్: మహిళలపై జరుగుతున్న వేధింపులు, దాడులు, హత్యలను వెంటనే అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య తిరుపతి నగర 7వ మహాసభ నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఈ ఘటనలపై ప్రధాని నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యావత్ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, కమరం బేగం, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నదియా, నగర ప్రధాన కార్యదర్శి ఎస్.మంజుల పాల్గొన్నారు.

వేడుకగా అర్జున తపస్సు

పిచ్చాటూరు: పిచ్చాటూరు ధర్మరాజు స్వామి తిరునాళ్లలో భాగంగా శుక్రవారం ఉదయం అర్జున తపస్సు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని తాటి చెట్టుపై అర్జున వేషధారు ఎక్కి తపస్సు చేస్తూ నిమ్మకాయలను జారవిడవగా.. వాటిని దక్కించుకోవడానికి మహిళలు పోటీపడ్డారు. అనంతరం గ్రామ దేవత గంగమ్మకు మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహిళలు పాలముంతలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ధర్మరాజు స్వామి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. సాయంత్రం అర్జునుని ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు. కంకణ దీక్షాపరులు ఊరేగింపు సేవలో తరించారు. ఏర్పాట్లను సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

కె.వడ్డేపల్లిలో పొలంబడి

పాకాల: మండలంలోని కె.వడ్డేపల్లి ఆర్బీకేలో శుక్రవారం రైతులకు వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పొలంబడి కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఏఓ పుష్పావతి మాట్లాడుతూ వేరుశనగ పంటను ఏవిధంగా సాగు చేయాలి, నష్టం రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రీకౌషిక్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సునీల్ చక్రవర్తి



తిరుపతి మంగళం: రాష్ట్ర రవాణా శాఖ సభ్యుడిగా నియమితులైన తిరుపతి పల్లెవీధికి చెందిన ముత్తంశెట్టి సునీల్‌చక్రవర్తి శుక్రవారం విజయవాడలో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, చైర్మన్ మనీషాకుమార్ సిన్హా ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర రవాణాశాఖ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రవాణాశాఖ అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కాపు సంక్షేమ చైర్మన్ ఆడపా శేషగిరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పొంగళ్లు

చంద్రగిరి(తిరుపతి రూరల్): దిగువ వీధికి చెందిన భక్తులు శుక్రవారం చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. ఆలయ మాజీ చైర్మన్, గ్రామ పినపెద్ద పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి, పెద్దకాపు యారాశి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో వందలాది మంది భక్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి వారికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మామిడి యాజమాన్య పద్ధతులపై అవగాహన

పాకాల: మామిడి కాయల కోత తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ రైతులకు అవగాహన కల్పించారు. ఆమె శుక్రవారం వల్లివేడు సమీపంలోని మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాయల కోత తర్వాత నెల రోజుల కొమ్మలు కత్తిరించాలని తెలిపారు. తర్వాత కొమ్మ చివరి భాగాన కాపర్ యాక్సిక్లోరైడ్ మందును పేస్టులా పూయాలన్నారు. అదేవిధంగా చెట్లు పూర్తిగా తడిచేలా 3 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్, క్లోరోపైరీపాస్ 3 మిల్లీ లీటర్లు, జిగురు 0.5 మిల్లీ లీటర్స్‌ని లీటర్ నీటికి కలిపి చెట్టు కొమ్మలు, కాండం బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు.

వైద్యరంగంలో జీవ, రసాయన శాస్త్రాలదే అగ్రస్థానం

తిరుపతి సిటీ: ఆధునిక వైద్య రంగంలో జీవ, రసాయన శాస్త్రాలదే అగ్రస్థానమని ఎస్వీయూ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. ఎస్వీయూలో శుక్రవారం అడ్వాన్సెస్ ఇన్ బయోకెమిస్ట్రీ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. మాజీ వీసీ రామ్మూర్తితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేడు వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతోందని, దానికి రసాయన, జీవ శాస్త్రాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఒక శాస్త్రంతోనే సరిపెట్టుకోకుండా కంప్యూటర్‌తోపాటు వివిధ శాస్త్రాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆచార్య రామమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓవీఎస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, అప్పారావు, ఐఐటీ ప్రొఫెసర్ ఆర్ సురేష్, సైంటిస్ట్ సుధీర్, మోహన్ బాబు యూనివర్సిటీ నుంచి ఎంఎం కేశవులు, బాలాజీ పాల్గొన్నారు.

మానసిక ధైర్యం కలిగి ఉండాలి

తిరుపతి ఎడ్యుకేషన్: ఆడ పిల్లలు మానసిక ధైర్యం కలిగి ఉండాలని పద్మావతి మహిళా వర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసోసియేట్ టి.చైతన్య తెలిపారు. శ్రీపద్మావతి బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై బాలికలకు అవగాహన కల్పించారు. చైతన్య మాట్లాడుతూ కౌమార దశలో ఆడపిల్లల్లో శారీరకంగా, మానసికంగా, సామాజికంగా చాలా మార్పులు కలుగుతాయని, అందుకు తగ్గట్టుగా నడవడికను అలవర్చుకోవాలన్నారు.

నేడు కవి సమ్మేళనం

తిరుపతి కల్చరల్: మణిపూర్ బాధితులకు సంఘీభావంగా శనివారం బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న తెలిపారు. ఇందులో కవులు, రచయితలు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన శిక్షణా తరగతులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కేఎస్‌కే ఇంజినీర్స్ సంస్థ సహకారంతో నిర్వహించిన మూడు రోజుల శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 129 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు స్థానిక పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కోఆర్డినేటర్ ఎం.హరిప్రసాద్, జనరల్ విభాగాధిపతి ఎస్వీ.గౌరీశంకర్, కేఈ.శరత్ రాఘవేంద్ర, ఏ.గురుప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధి ప్రదాత జగనన్న

- జగనన్న సురక్షతో తిరుపతిలో 43 వేలకుపైగా సర్టిఫికెట్ల మంజూరు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, అధికారులు

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తూ సంక్షేమ, అభివృద్ధి ప్రదాతగా నిలిచారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. కొర్లగుంట వైఎస్‌ఆర్ మార్గ్ వద్ద శుక్రవారం 5, 9 డివిజన్లకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, మున్సిపల్ కార్పొరేషన కమిషనర్ హరిత, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నేరవేర్చి, దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. పథకాల ద్వారా ఇప్పటి వరకు ప్రజలకు రూ.3.30 లక్షల కోట్లు అందజేశారని తెలిపారు. మేయర్ శిరీష మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఇన్ని సంక్షేమ పథకాలు అందించిన నాయకుడు జగనన్న మాత్రమేనన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలతో పథకాలు అందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమంలో న్యాయం చేశామన్నారు. తిరుపతిలోని 102 సచివాలయాల ద్వారా 43 వేల సర్టిఫికెట్లను ప్రజలకు ఉచితంగా అందజేశామన్నారు. టౌన్ బ్యాంకు చైర్మెన్ కేతం జయచంద్రా రెడ్డి, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, ఆదం లీలావతి, తిరుపతి మునిరామిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు శ్రీదేవి, ఇమామ్ సాహెబ్, ఆదం సుధాకర్ రెడ్డి, దొడ్డారెడ్డి మురళీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి దంపతులు

తిరుపతి అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తన సతీమణి కళ్యాణి, జేసీ డీకే బాలాజీ, ఆయన సతీమణి పృథ్వీకళ్యాణితో కలిసి తిరుపతి రూరల్ మండలం పేరూరు సమీపంలోని జాతీయ రహదారి సమీపంలో మొక్కలు నాటారు. ఈ నెల 12న కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ మొక్కలు నాటే కార్యక్రమానికి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా జిల్లా అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఆదరించండి



కరపత్రాన్ని అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి పల్లెలోనూ అభివృద్ధి చేశామని, వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం రావిళ్లవారిపల్లి పంచాయతీ పాపిరెడ్డికండ్రిగలో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పల్లెలోనూ సీసీ రోడ్లు వేశామని, తాగునీటి ట్యాంకులు, రచ్చబండలు, బెంచీలు, గ్రంథాలయాలు ఏర్పాటుచేశామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆశయాల సాధన కోసం కృషి చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు మహేంద్రరెడ్డి, బాబు యాదవ్, భాస్కర్‌రెడ్డి, నీలకంఠ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అరవిందుల తత్వాన్ని అవగాహన చేసుకోవాలి

తిరుపతి సిటీ: భారతీయ తాత్విక చింతనను విశ్వవ్యాప్తం చేసిన అరవిందుల తత్వాన్ని యువత అవగాహన చేసుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అరవింద్ జయంతి సందర్భంగా వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలోని ఆచార్య జీఎన్ రెడ్డి సెమినార్ హాల్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నీతి, నిజాయితీతో మెలగాలని, నిరాదరణకు గురైన వారికి ధైర్యాన్ని, చేయూతను ఇవ్వాలని సూచించారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అరవిందుల పుస్తకాలను, బహుమతులు అందజేశారు. తెలుగు విభాగం సలహాదారు ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు రెడ్డి, విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, ఆంగ్ల విభాగాధిపతి సుమకిరణ్, ఫిలాసఫీ విభాగాధిపతి చంద్రయ్య, విశ్రాంతాచార్యులు అబ్దుల్ సత్తార్, అరవిందో ఆశ్రమ సొసైటీ ప్రతినిధులు విక్రమ్, వేణుగోపాల్, రవి, రామచంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విజేతలతో సెట్విన్ సీఈవో మురళీకృష్ణ

తిరుపతి కల్చరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సెట్విన్ సీఈవో వి.మురళీకృష్ణ తెలిపారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం యువజన సర్వీసుల శాఖ, ప్రభుత్వం, సెట్విన్ సంయుక్తంగా ఎస్వీ జంతు ప్రదర్శన శాలలో ప్రపంచం, ప్రకృతి పరిరక్షణ దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయనతో పాటు వెటర్నరీ సివిల్ సర్జన్ అరుణ్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుతో పాటు ప్రకృతిని పరిరక్షించుకోవడంతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ఆ దిశగా అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

కళా సంపదను భావితరాలకు అందించాలి



మహిళా వేదికపై మాట్లాడుతున్న మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: భారతీయ నాటక, నాట్య కళా సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని మేయర్ శిరీష పిలుపునిచ్చారు. అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక, నృత్యోత్సవ పోటీల్లో భాగంగా శుక్రవారం మహతి కళాక్షేత్రంలో మహిళా వేదిక నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి విస్తృతమవుతున్న నేపథ్యంలో భారతీయ కళలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందన్నారు. 23 ఏళ్లుగా కళలను, కళాకారులను ప్రోత్సహిస్తున్న అభినయ ఆర్ట్స్ నిర్వాహకులు అభినందనీయులన్నారు. అనంతరం ఎన్.తులసి, రాజ్యలక్ష్మి, మహేశ్వరి, అరుణ, పద్మావతిని అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్.రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, మబ్బు సూర్యానారాయణరెడ్డి, డి.విజయకుమార్, విశ్వనాథరెడ్డి, ఎన్.ధర్మయ్య పాల్గొన్నారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటికలు, శాస్త్రీయ, జానపద బృంద నృత్య కళా ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారిని అభినయ ఆర్ట్స్ బీఎస్.రెడ్డి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేద్దాం

తిరుపతి మంగళం: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు రణధీర్‌పురం పంచాయతీలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేద్దామని ఆ పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం సచివాలయంలో పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు.

అండర్ డ్రైనేజీ పనులకు భూమి పూజ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ తూర్పుపల్లిలో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం శుక్రవారం భూమి పూజ చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అండర్ డ్రైనేజీ ఏర్పాటుకు రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి పొలాలకు వెళ్లాలంటే 5 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు చెంగల్రాయులు, గోపాల్, నాగభూషణం, కాంట్రాక్టర్ ప్రకాశ్ రెడ్డి, దామోదరం, కె.గోపి పాల్గొన్నారు.

వేలంలో రూ.3.40 లక్షల ఆదాయం

పాకాల: వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆగస్టు 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో తలనీలాలు సేకరించేందుకు నిర్వహించిన వేలం ద్వారా రూ.3.40 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం వేలం పాటలు నిర్వహించారు.

1న అష్టోత్తర శతకలశాభిషేకం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఆగస్టు 1వ తేదీన పౌర్ణమి సందర్భంగా అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు. అక్కడి నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణికి వేంచేపు చేసి ఆస్థానం చేపడతారు. పుష్కరిణి హారతి నిర్వహిస్తారు.

కావమ్మ ఉత్సవాలు ప్రారంభం

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం నెహ్రూనగర్‌లోని మహాగణపతి, కావమ్మ, మారయ్య ఆలయంలో శుక్రవారం రాత్రి కావమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త కట్టా జయరామ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా శ్రావణ మాసంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

టీడీపీలో మొదలియార్లకు గుర్తింపులేదు



మొదలియార్ రమేష్‌ను సత్కరిస్తున్న తిరుమలనగర్ వాసులు

తిరుపతి మంగళం : గత టీడీపీ ప్రభుత్వంలో మొదలియార్లను పట్టించుకోలేదని తిరుమలనగర్ పంచాయతీ అధ్యక్షుడు మొదలియార్ రమేష్ తెలిపారు. ఓట్ల కోసమే వాడుకున్నారని ఆరోపించారు. ఆయన మంగళం తిరుమలనగర్ పంచాయతీ అధ్యక్షుడిగా నియమితులైన విషయం తెలిసిందే. తనకు పదవి ఇచ్చిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించుకునేందుకు మొదలియార్లంతా కృషి చేస్తామని చెప్పారు. ఆయనను తిరుమలనగర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్‌రాజు, తిరుమలనగర్ వాసులు ఘనంగా సత్కరించారు.

దళితుల జీవితాలకు వెలుగు విదేశీ విద్యా దీవెన

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన యావత్ బడుగు, బలహీనవర్గాల బతుకులకు వెలుగు రేఖ అని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు తెలిపారు. గత ప్రభుత్వం విదేశీ విద్యా పథకం కింద రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలను కంటి తుడుపుగా అందజేసిందని విమర్శించారు. గుర్తింపులేని వర్సిటీల్లో చదువులకు అవకాశం కల్పించిందని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగనన్న విదేశాల్లో పేరు పొందిన వర్సిటీల్లో చదువుకునే అవకాశం కల్పిస్తున్నారని, వారికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి అందజేయడం చరిత్రాత్మకమని తెలిపారు.

క్యూరీ ల్యాబ్‌ను సందర్శించిన ఢిల్లీ బృందం

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని క్యూరీ ల్యాబ్‌ను న్యూఢిల్లీకి చెందిన వైజ్‌కిరణ్ డివిజన్ బృందం శుక్రవారం సందర్శించింది. బేసిక్ అప్‌లైడ్ సైన్సెస్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్ట్ రివ్యూలో భాగంగా విజిట్ చేశారు. ల్యాబ్‌లోని పరిశోధక పరికరాల ఉపయోగం, ల్యాబ్ ప్రత్యేకతలకు గురించి అక్కడి పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులను విచారించారు. అనంతరం వీసీ భారతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- చంద్రబాబు, పవన్ విమర్శలను ప్రజలు నమ్మరు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 7వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు

తిరుపతి మంగళం: అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించి వారి గుండెల్లో నిలిచిపోయిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, టౌన్ బ్యాంకు చైర్మెన్ కేతం జయచంద్రారెడ్డితో కలిసి 7వ డివిజన్ చంద్రశేఖర్‌రెడ్డి కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్ల పాలనలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబునాయుడు తన 14 ఏళ్ల పాలనలో ఏనాడూ పేదల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి జగనన్నపై ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, టి.మునిరామిరెడ్డి, టౌన్ బ్యాంకు డైరెక్టర్ మహ్మద్‌కాసీమ్ పాల్గొన్నారు.

పీర్లకు ఎమ్మెల్యే భూమన పూజలు

తిరుపతి కల్చరల్: మొహర్రం సందర్భంగా గాలి వీధి చావడిలో ఏర్పాటు చేసిన పీర్లను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సందర్శించి పూజలు చేశారు. ఆయనకు కో ఆప్షన్ సభ్యుడు ఎస్.ఖాదర్‌బాషా, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరి ఘనం స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, ఇమ్రాన్, ఇమామ్, కార్పొరేటర్లు కుడితి సుబ్రమణ్యం, కోటూరి ఆంజనేయులు, గఫూర్, ఖాశీం, రఫీ హిందూస్థానీ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



ప్రార్థనలు చేస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల : మొహర్రం పండుగ త్యాగానికి, మతసామరస్యానికి ప్రతీకని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం పేరసానిపల్లి పంచాయతీ కుమ్మరపల్లి, తురకపల్లిలోని మకాన్లలో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, రఘుపతి, సర్పంచ్ శాంత, ఎంపీటీసీ మల్లికార్జున, రహీం, ఏబీ.సుబ్రమణ్యం, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఇక తిరుపతిలో స్మార్ట్ స్ట్రీట్‌లు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో స్మార్ట్ స్ట్రీట్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె శుక్రవారం తిరుమల బైపాస్ రోడ్ నుంచి తిరుచానూరు రోడ్డు వరకు పలు రహదారులను పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు, ఓటరు జాబితాపై అధికారులతో వేర్వేరుగా సమీక్షించారు. స్మార్ట్ స్ట్రీట్లను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌ఈ మోహన్, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎంఈ చంద్రశేఖర్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, డీటీ జీవన్ పాల్గొన్నారు.